

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సుజాత మాట్లాడుతూ చిరుధాన్యాలతో జావా మెత్తగా వండి చిన్నారులకు తినిపించాలని, అలాగే బాలామృతమును తినిపించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, కారోబార్ ముల్క జలంధర్, ఆయమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత సర్పంచ్ స్థానాలకు 902 నామినేషన్లు

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు శుక్రవారం గడువు ముగిసే సరికి 3,559 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 119 సర్పంచ్ స్థానాలకు గానూ 902 నామినేషన్లు, 1,088 వార్డు సభ్యుల స్థానాలకు గానూ 2,657 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు ప్రకటించారు.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ధర్మపురి	25	150	224	501
బుగ్గారం	10	90	96	261
ఎండపల్లి	15	138	138	467
వెల్గటూర్	19	125	168	264
గొల్లపల్లి	27	203	246	613
పెగడపల్లి	23	196	216	551
మొత్తం	**119**	**902**	**1,088**	**2,657**

వాహనాల తనిఖీలు

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో రెవెన్యూ, ఇన్‌స్పెక్టర్, జీపీవో, పోలీస్ కానిస్టేబుల్ ఉండగా నిత్యం కరీంనగర్-జగిత్యాల మార్గంతో పాటు అన్ని గ్రామాల్లో వాహనాలు తనిఖీలు చేస్తూ అనుమానిత వస్తువులు, ఇతరాత్ర పరిశీలిస్తున్నారు. పోలింగ్ పూర్తి అయ్యేవరకు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ఉంటాయని అధికారులు తెలిపారు.


కొడిమ్యాల: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిరంతరం కొనసాగుతోంది. మల్యాల సీఐ నీలం రవి పర్యవేక్షణలో కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీస్ టీం ద్విచక్ర వాహనాలను, కార్లతో పాటుగా ఇతర వాహనాలను స్టాటిక్ సర్వైల్ టీం(ఎస్ఎస్‌టీ)ఆపి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

- వలస ఓటర్లపై పంచాయతీ అభ్యర్థుల నజర్
- పట్టణాల్లో ఉంటున్న వారికి ఫోన్లు
- ముంబాయి, భీవండి, హైదరాబాద్.. తదితర పట్టణాలకు ట్రావెల్స్ బస్సులు
- ప్రతీ ఓటు కీలకం కావడంతో దూర ప్రాంత ఓటర్లను రప్పించడానికి ప్రయత్నాలు

అన్నా.. తప్పక రావాలే..



పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే.. సర్పంచ్, వార్డు మెంబర్‌గా ఒక్కఓటు తేడాతే ఓడిపోయిన అభ్యర్థులు ఉన్నారు. దీంతో ఇంటింటి ప్రచారంతో ఒక వైపు గ్రామంలో నివాసం ఉంటున్న ఓటర్లను అభ్యర్థులు ఆకర్షిస్తున్నారు. మరోవైపు వలస ఓటర్లపై దృష్టి సారిస్తున్నారు. ఒక్క ఓటు కూడా చేజారిపోకుండా ముందుగానే జాగ్రత్త పడుతున్నారు.

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఎక్కడ చూసినా ఎన్నికల హడావుడి... రచ్చబండల వద్ద జోరుగా చర్చ జరుగుతోంది. పంచాయతీ సమరంలో ప్రతీ ఓటు కీలకం కావడంతో అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. విజయం తమనే వరించాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి ప్రచారంతో ఒక వైపు గ్రామంలో నివాసం ఉంటున్న ఓటర్లకు గాలం వేస్తున్నారు. పోలింగ్‌కు వచ్చేలా పల్లె నాయకులు, స్థానిక పెద్దలు ఫోన్లు చేస్తూ వలస ఓటర్లను రప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లోని ఓటర్లను దగ్గరుండి పల్లెకు రప్పించేందుకు ప్రత్యేకంగా మనుషులను కేటాయించడంపై దృష్టి సారించారు. అవసరమైతే ఓటు కు రేటు కట్టి మరీ పల్లెకు చేరుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉపాధి నిమిత్తం పలు పల్లెల యువతీయువకులు పట్టణాలతో పాటు హైదరాబాద్, ముంబాయి, భీవండి, పుణే, బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లిన గ్రామాలకు చెందిన వ్యక్తుల ఓట్లను రాబట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

● జిల్లాలో 385 పంచాయతీలు..

జగిత్యాల జిల్లాలోని 20 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో 385 పంచాయతీలు, 3,536 వార్డుసభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 6,07,263 మంది పంచాయతీ ఓటర్లున్నారు. ఇందులో 2,89,702 మంది పురుషులు, 3,17,552 మంది స్త్రీలు, తొమ్మిది మంది ఇతరులున్నారు. 3,536 జంబో బ్యాలెట్ బాక్సులు, 1,428 సాధారణ బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచారు. జిల్లాలో తొలి విడతలో 122 సర్పంచ్ 1,172 వార్డులకు, రెండో విడతలో 144 సర్పంచ్ 1,276 వార్డులకు, మూడో విడతలో 119 సర్పంచ్ 1,088 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి

● సోషల్ మీడియాలో సందేశాలు..

పంచాయతీ ఎన్నికల్లో పల్లె ఓటర్లతో పాటు ఉపాధి నిమిత్తం పట్టణాలకు వెళ్లిన ఓటర్లు సైతం కీలకమవుతున్నారు. అన్నా హైదరాబాద్‌లో మనోడు వచ్చడా, ముంబాయి, భీవండి నుంచి ఎప్పుడు బయలు దేరుతున్నారు అంటూ అభ్యర్థులు వాకబు చేస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పెళ్లి ఆహ్వాన పత్రాలు పంపినట్లుగా వాట్సాప్ గ్రూపుల్లో ఓటర్లకు తమ అభ్యర్థి తరపున సందేశాలు పంపిస్తున్నారు. అన్నా పోలింగ్ రోజు తప్పకుండా గ్రామానికి రావాలి. మీ అమూ ల్యమైన ఓటు వేయాలి.. అంటూ మెసెజ్‌లు వెల్లు వెత్తుతు న్నాయి. కొందరు అభ్యర్థులు ముహర్తాలు చేసు కుని పట్నం బయలు దేరి ఊరి ఓటర్లు ఉన్న కాలనీలకు వెళ్లి సమావేశాలతో వారి మనసు గెలుచుకునే ప్రయ త్నం చేస్తున్నారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారు... ఎక్కడ ఉంటున్నారు... ఎప్పుడు వస్తారు... ఎలాంటి వాహనాలు ఏర్పాటు చేయాలి.. అనే పనిలో అభ్యర్థుల అనుచరులు నిమగ్నమయ్యారు. మరికొంత మంది అభ్యర్థులు తమ ఓటర్లకు వ్యక్తిగతంగా పోన్ చేసి మద్దతు కోరుతున్నారు. వలసల పెరుగుదలతో ఇప్పుడు గ్రామరాజకీయాల్లో పట్నం ఓటర్ల ప్రభావం పెరిగింది.

● విందులే విందులు..

గ్రామాల్లో ఓటర్లను ఆకర్షించే విధంగా విందు రాజకీయాలకు తెర లేపుతుండగా పట్నంలో ఉన్న

(మిగతా 8వ పేజీలో)

● రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న అభ్యర్థులు..

గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సందడి జోరందుకుం టోంది. అభ్యర్థుల ఇళ్లలో హడావుడితో పాటు బయట కూడా అదే ఉత్సాహం కనిపిస్తోంది. హైదరాబాద్ భీవండి, నిజామాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ట్రా వెల్స్ బస్సులు, కార్లను ముందస్తుగా బుక్ చేస్తున్నారు. పోలింగ్ రోజున సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లను తీసుకొచ్చే వాహనాలు ఆలస్యం కాకుండా ముందస్తుగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకు ంటున్నారు.

13 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు

కథలాపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సింగిల్ విండో నిర్వహిస్తోన్న కొనుగోలు కేంద్రంలో 13 వేల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేశామని భూషణరావుపేట సొసైటీ సీఈవో ఊశకోల అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి రైతులు మొక్కజొన్న తెచ్చి విక్రయించుకోవాలని కోరారు. మరో ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం కేంద్రానికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లక్షా 15 వేల క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్ధారణ పరీక్షలను అందరు వినియోగించుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి ఎన్ శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల అర్బన్ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, జ్వరం, దగ్గు లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యాధికారి కృష్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ సెలవు ప్రకటించాలి

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనవరి 29, 30, 31 తేదీల్లో జరుగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు మూడు రోజులు సాధారణ సెలవులు ప్రకటించాలని తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్టు ఒక ప్రకనలో తెలిపారు. ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మూడురోజులు సాధారణ సెలవు ప్రకటించాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

- కలెక్టర్ బి సత్యప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జోనల్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 24 అందించిన ప్రతీ ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ అధికారులందరూ విధులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామగ్రి పంపిణీ చేసామో లేదో సరిచూసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఉదయమే సిబ్బంది పోలింగ్‌స్టేషన్ వద్దకు చేరుకునేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్‌కు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలు జరిగిన రోజే ఉపసర్పంచ్ ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్, డీపీవో రఘువరన్, నోడల్ అధికారులు రేవంత్, రవికుమార్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం: మొదట విడత పంచాయతీ ఎన్నికలో భాగంగా ఈనెల 11న మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాల్లో నిర్వహించే ఎన్నికలను అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణపై పీవో (ప్రిసైడింగ్ ఆఫీసర్ల)లకు ఇస్తున్న శిక్షనను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల్లో నిర్వహర్తించే విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించి పలు అంశాలపై వారిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అధికారులు ఎన్నికల విధులను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని, ప్రతి పీవో తమ ప్రాతను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధివిధానాలు, పోలింగ్ స్టేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన పలు అంశాలపై మార్గదర్శకాలు చేస్తూ సూచనలు చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం తహసీల్దార్లు నీత, వరప్రసాద్, ఆర్ఐ కాంతయ్య, ఎంపీడీవో సురేష్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

- ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. కేంద్రాలకు ప్రహరీ, కరెంట్, మంచినీరు, భద్రతా చర్యలు వంటి పలు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటి విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 యాక్ట్ (144)సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు అనిల్ కుమార్, సురేష్, ఎస్ఐలు అనిల్, కిరణ్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



వెల్లుల్లలో పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

మురుగుకాలువలో నిలిచిన నీరు

- వెదజల్లుతున్న దుర్గంధం



పెగ్గెర్లలోని బీసీ కాలనీలో నిల్వ ఉన్న మురుగునీరు

కథలాపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగ్గెర్ల 8వ వార్డులోని బీసీ కాలనీలో మురుగు కాలువ సమస్య ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాల వైపు నుంచి నిర్మించిన మురుగు కాలువ నీరు ఒకే చోట నిల్వ ఉంటుండడంతో సమీప ఇళ్ల వారికి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో ఈ కాలువ నుంచి నేరుగా మురికి నీరు చెరువులోకి వెళ్లేది. అయితే అటు వైపు పలువురు ఇళ్ల నిర్మించుకోవడం వల్ల మురికి నీరంతా ఒకే చోట నిలుస్తోంది. ఇప్పటికీ అనేక మంది సర్పంచులు, వార్డు సభ్యులు మారినప్పటికీ ఈ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. పైభాగం నుంచి వచ్చే మురికి నీటి కోసం కమ్యూనిటీ ఇంకుడు గుంతను గ్రామ పంచాయతీ నుంచి తవ్వించారు. గుంత నిండిపోయి మురికి నీటి వాసనతో తీవ్ర అవస్థ పడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తపస్ మండల అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



కిరణ్



వంశీ

బీర్‌పూర్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యో తి): బీర్‌పూర్ మండల తపస్ (తెలంగాణ ప్రాంతీయ ఉపా ధ్యాయ సంఘం) మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్ (సెకండరీ గ్రేడ్ టీచర్) మండల పరిషత్ ప్రైమరి స్కూల్ కందనకుంట, ప్రధాన కార్యదర్శి గా వడ్డుపురం సత్య వంశీ (స్కూల్ అసిస్టెంట్) జిల్లా పరిషత్ పాఠశాల తుంగూర్ ఎన్నికయ్యారు. వీరు మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉం టారని ఎన్నికల పరిశీలకులు ఒడ్నాల రాజశేఖర్, గుడిసె పూర్ణచందర్ తెలిపారు. మాజీ అధ్యక్షుడు బొయినేపల్లి చంద్రశేఖర్, మ్యాన రమాదేవి, జిల్లా బాధ్యులు గంప కిరణ్‌కుమార్, మంద మధుకర్, అనిల్ కుమార్, స్వరూప, శిరీష ఉన్నారు.

జగిత్యాల పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరి అయ్యాయని, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తూ జగిత్యాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని 34,35,44 వార్డుల్లో టవర్ సర్కిల్ నుంచి గీతాభవన్ వరకు బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టవర్ వద్ద మార్కెట్‌ను అభివృద్ధిచేసి మార్కెట్ ఆలయ అభివృద్ధికి, బ్రాహ్మణవాడ రామాలయం వద్ద ధ్యాన మందిరం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీ మౌలిక సదుపాయాల కల్పన కోసం 12.5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మంచినీటి చెరువులు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. పట్టణంలో సమగ్ర అభివృద్ధి కోసం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, రహదారులు, డివైడర్లు, డ్రైనేజీలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అడువాల లక్ష్మణ్ జ్యోతి, గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, కమిషనర్ స్పందన, డీఈ ఆనంద్, మాజీ కౌన్సిలర్లు గట్టు సతీష్, పిట్ట ధర్మరాజు, బాలేశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

చారిత్రక కట్టడాల ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి



త్రికూటాలయం ఎదుట విద్యార్థులు

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను తెలుసుకోవాలని తెలుగు పండితుడు కామని లక్ష్మయ్య అన్నారు. రాయికల్ పట్టణంలోని త్రికూటాలయాన్ని శుక్రవారం జోగిన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం, రాయికల్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు పాలకుర్తి రాంనరేష్, చెరుకు మహేశ్వర శర్మ పాల్గొన్నారు.

ఎన్నికలపై ప్రజలకు అవగాహన

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలపై సారంగాపూర్ ఎస్ఐ గీత ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎన్నికల నిర్వహన పారదర్శకంగా జరిగేలా యువత సహకరించాలని కోరారు. ఎన్నికల వేళ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గీత

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



వైద్యులతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం సందర్శించి వైద్యులు, ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడారు. ఓపీ నమోదు రికార్డును పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యాన్ని ఆరా తీశారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని సంబధింత రాష్ట్ర అధికారి విశ్వప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్లాంట్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు వసీం, అన్వర్, జాల వినోద్ పలువురు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న పోలింగ్ సామగ్రి



పోలింగ్ సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

మల్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండవ విడతలో ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల కోసం పోలింగ్ సామాగ్రి సిద్ధం అవుతోంది. 19 గ్రామపంచాయితీలు, 186 వార్డు స్థానాలకు గాను పోలింగ్ కేంద్రంలో ఉండే ప్రతి సామగ్రిని వార్డుల వారీగా విభజించి సంచిలో కట్టారు. పోలింగ్ డబ్బాలకు పోలింగ్ స్టేషన్‌వారీగా నంబర్లు వేశారు.

వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతి



నర్సింగాపూర్‌లో విచారిస్తున్న ఏసీపీ మాధవి

వీణవంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి కొమురారెడ్డి(90), భార్య సింగిరెడ్డి చిలుకమ్మ(70) దంపతులు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. వృద్ధదంపతుల కూతురు కొత్తిరెడ్డి సరోజన శుక్రవారం ఎప్పటిలాగే ఎలబాక నుంచి తల్లిదండ్రులను చూసేందుకు గ్రామానికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇద్దరు రెండు మంచాల్లో మృతిచెంది ఉన్నట్లు గుర్తించింది. ఇంటి పక్కన ఉన్నవారికి సమాచారం అందించింది. కొమురారెడ్డి కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడని, జీవింతపై విరక్తిచెంది ఇద్దరు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని కూతురు సరోజన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి బలవన్మరణం



అభినయ్‌సుదన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఓ బీటెక్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొక్కొండ రమేష్-రజితల కుమారుడు అభినయ్ సుదన్(19) మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. అభినయ్‌సుదన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన పవర్‌లూం కార్మికుడు ఎల్లా రమేష్(41) ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో రమేష్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేశాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అందిన కాడికి అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య లత మందలించడంతో ఈనెల 3వ తేదిన ఇంటి నుంచి వెళ్లిన రమేష్ మండల కేంద్రం శివారు మానేరు నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని శుక్రవారం శవమై కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తొంటి రమేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగునూర్-జూబ్లీనగర్‌ల మధ్య నవంబరు 30న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కరీంనగర్‌రూరల్ మండలం చామనపల్లికి చెందిన తొంటి రమేష్(20) చికిత్సపొందుతూ మృతిచెందాడని కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా తీవ్రంగా గాయపడిన రమేష్‌ను కుటుంబసభ్యులు హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతిచెందాడని తెలిపారు. మృతదేహానికి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసినకేసులో నిందితుడు మాడుపు నరసింహచారి(35)కి 20 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపుసెషన్స్ న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... బాలిక(11) ఏడవతరగతి చదువుతున్నది. బాలిక ఇంటిపక్కనే నిందితుడు మాడుగు నరసింహచారి తనతల్లితోకలిసి కిరాయి ఉంటున్నాడు. పక్కపక్కనే ఇల్లు ఉండడంతో బాధిత బాలిక తరచూ నిందితుడు నరసింహచారి ఇంటికి వెళుతుండేది. ఆ క్రమంలో అక్కడనే పడుకుంటూ ఉండేది. అదే అలుసుగా తీసుకున్న నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. వయస్సువచ్చిన తరువాత వివాహం చేసుకుంటానని నమ్మించి రెండుసార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి నిందితుడి తల్లిని అడిగితే నాకొడుకుకు నీ కూతురును ఇచ్చి పెళ్లి చేయమని దబాయించింది. ఈ విషయమై సదరు బాధితురాలు 2022మార్చి 2న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు పోలీసులు నిందితుడు నరసింహచారిపై భారతీయ శిక్షాస్మృతిలోని అత్యాచారం కేసుతోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అప్పటి సీఐ శ్రీనివాసరావు కేసు విచారణజరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ కోర్టులో సాక్షులను హాజరు పరిచి వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి వెంకటేష్.. నింది తుడిపై కేసు రుజువుకావడంతో నిందితుడు మాడుపు నరసింహచారికి 20ఏళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పుచెప్పారు. ఈకేసులో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటిఇన్‌స్పెక్టర్(ఏసీపీ) తుల శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్, ఇతర పోలీసు అధికారుల బృందాన్ని పోలీస్‌కమిషనర్ అభినందించారు.

బోరు మోటార్ల చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటార్లను గురువారం రాత్రి అపహరించుకుపోయారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన బాబు మండలకేంద్రంలో బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నడుపుతున్నాడు. మరమ్మతు కోసం రైతులు తీసుకు వచ్చినమోటార్లను దుకాణంలోంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. చోరీ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- ఎన్నికల సమయంలోనే నియంత్రణ
- గ్రామాల్లో ఇష్టారీతిన మద్యం విక్రయాలు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో నియంత్రణ చేపడుతున్నా ఆ తర్వాత గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం బెల్ట్ షాపులను మూసివేయిస్తున్నారు. గ్రామాల్లో, రోడ్ల పక్కన విచ్చలవిడిగా కిరాణాషాపులకు రెట్టింపు సంఖ్యలో మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా 24 గంటల పాటు యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతున్నప్పటికీ ఎక్సైజ్, ఇటు పోలీసుశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టించుకోవటం లేదు. మద్యం మత్తులో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని నివేదికలు చెపుతున్నా బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. బెల్ట్‌షాపులతో పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు ఆర్థికపరమైన లాభాలుండటంతోనే వీటి పై కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చిపెడుతున్న మద్యం అమ్మకాలపై ప్రభుత్వ వైఖరి కూడా చూసి చూడనట్లుగా ఉన్నది. ప్రజల ప్రాణాలకు భద్రత, రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తు న్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీరు సైతం దొరకని గ్రామాల్లో అర్ధరాత్రి వేళ కూడా మద్యం చేయి చాచితే అందు బాటులో ఉండేలా గల్లీ గల్లీకి బెల్ట్‌షాపులు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 వేలకుపైగా బెల్ట్‌షాపులు మద్యం విక్రయాలను చేస్తున్నట్లు అంచనా.



● ఎన్నికల వేళ అధికారుల తనిఖీలు

ఎన్నికల సమయంలో పల్లెలు, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ పోలీసుశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల వేళ గ్రామాలలో రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య గొడవలు జరుగకుండా, పల్లెల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగకుండా మద్యం విక్రయాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామాలలో బెల్ట్‌షాపులను పోలీసులు మూసివేయిస్తూ నిర్వాహకులను తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు.

● ఆర్థికంగా చితికిపోతున్న పేద, కార్మిక కుటుంబాలు

గ్రామాలు, పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులతో గ్రామీణ ప్రాంత పేదలు, కార్మికుల కుటుంబాల జీవనం కల్లోలంగా మారుతున్నది. గ్రామాలలో బెల్ట్‌షాపుల ఏర్పాటుపై కొన్ని ప్రాంతాల్లో మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు ఉద్యమిస్తూ మద్య నిషేధం తీర్మానం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో గ్రామాలలో బెల్ట్‌షాపుల నిర్వహణకు అనధికారిక లైసెన్స్‌ల కోసం గ్రామ చావడిలో వేలం పాటలు నిర్వహించి షాపులను ఖరారు చేసుకుంటున్నారు. ఒక్కో షాపుకు లక్ష నుంచి 5 లక్షల రూపాయల వరకు కూడా పాడిన సందర్భాలు ఉన్నాయి. పల్లెల్లో మద్యం అమ్మకాల కారణంగా తమ కుటుంబాలు నాశనమై పోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా నెలనెలా ఎక్సైజ్, పోలీసు అధికారులకు, అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులకు లక్షలాది రూపాయల ముడుపులు ముడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

నాటుసారా పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మక్తానాయక్ తండాలో 5లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్టు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మక్తానాయక్ తండాకు చెందిన బలరాం అనేవ్యక్తి గుడుంబా తయారు చేస్తున్నట్టు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేయగా 5లీటర్ల నాటుసారా లభ్యమైనట్టు తెలిపారు. లభ్యమైన నాటుసారా సీజ్‌చేసి, బాధ్యుడైన బలరాంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెల్లడించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రారక్టర్లను శుక్రవారం పట్టుకుని, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. గ్రామాలలో మద్యం అమ్మేవారు, కేసులు ఉన్నవారు, ఉద్రిక్త పరిస్థితులు కల్పించే వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం బైండోవర్ చేసిన ఇద్దరితో కలిపి ఇప్పటి వరకు 183మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్థుల ఆందోళన



అన్నారంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అన్నారంలో నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నారంలో ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలతో దుమ్ము ఇళ్లలోకి చేరుతోందని, ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ స్వాతి ప్రతీరోజు రోడ్డుపై నీరు పోసేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

మానేరు చెక్‌డ్యామ్‌ను పేల్చివేశారు

- జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్



గుంపుల చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న ప్రకాష్

ఓదెల/జమ్మికుంట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంపుల తనుగుల మధ్య ఉన్న మానేరులో నిర్మించిన చెక్‌డ్యామ్ కూలిపోవడం నాణ్యత లోపం కాదని, ఇది ముమ్మాటికి పేల్చివేతేనని జలవనరుల శాఖ మాజీ చైర్మన్ ప్రకాష్ అన్నారు. నవంబర్ 21న, చెక్ డ్యామ్ పేల్చి వేసినట్లు ఫిర్యాదు చేయగా, 22న, ఎఫ్ఐఆర్ అయిందని, ఇప్పటివరకు కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శుక్రవారం నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో గుంపుల, తనుగుల చెక్ డ్యామును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, సంఘటన స్థలంలో జిలెటిన్ స్టిక్స్ దొరికినా, కొందరు నాణ్యతాలోపం అనడం విడ్డూరమని తెలిపారు. దిగువనున్న వావిలాల చెక్ డ్యామ్ నాణ్యతలోపం వల్ల కుంగిపోయిందన్నారు. ఇది మాత్రం కచ్చితంగా పేల్చివేతేనని తెలిపారు. నవంబర్ 21న, సంఘటన స్థలానికి సంబంధించిన ఇంజనీరింగ్ రవి కూడా పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారని, అనంతరం లేబలెటర్లో పరీక్ష చేసిన తర్వాత ఇది పేల్చినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి ఈ సంఘటనకు పాల్పడ్డట్లు తెలిపారు. రైతుల కోసం కట్టిన చెక్ డ్యాముల్లో కొంత మేరకే నష్టం వాటిల్లినప్పటికీ ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేసీఆర్ వందలాది కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాములు రైతులకు ఉపయోగపడేవని, చెక్ డ్యామును పరిశీలించిన తర్వాత ఇది కచ్చితంగా పేల్చివేతేనని నిపుణులు కూడా తేల్చి చెప్తున్నారని అన్నారు. అయినా కూడా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని తెలిపారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్లు సీతారామారావు, రాఘవరెడ్డి, జలవనరుల శాఖ మాజీఇంజనీర్లు దామోదర్‌రెడ్డి, వెంకటేశం శ్రీధర్ రావుదేష్ పాండే, వికాస జిల్లా అధ్యక్షుడు మల్లోజుల విజయ నంద్, వి.కా.స. ఎర్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- 30క్వింటాళ్ల పత్తి దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఆస్థినష్టం జరిగిన సంఘటన వేములవాడ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన పెరుగు జలందర్ అనేరైతు ఇంట్లో పత్తిని నిల్వచేశాడు.

షార్టుసర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సుమారుగా 20నుంచి 30క్వింటాళ్ల వరకు పత్తి అగ్నికి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఇంట్లో పత్తి నిల్వ ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగిసిపడ్డాయి. అదృష్టవశాత్తు ఇంటిలో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.

మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా నివారించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. నష్టపోయిన రైతును అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

గడ్డిట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న గడ్డి, ట్రాక్టర్

ఎలిగేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌లోని రేగులగడ్డ ప్రాంతం నుంచి శివపల్లికి గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో డ్రైవర్‌గమనించి ట్రాక్టర్‌నురోడ్డుపై నిలిపివేశాడు. ఈ మంటల్లో గడ్డితోపాటు ట్రాలీ, ఇంజను, టైర్లు కాలిపోయాయని తెలిపారు.

దొంగ అరెస్ట్..

- రూ.3,92,500 స్వాధీనం



దొంగను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి డబ్బుల బ్యాగును దొంగిలించిన కేసులో బండారి బాలరాజును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్లడీఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు. అతనిదగ్గర నుంచి రూ3లక్షల 92వేల 500లను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో టౌన్‌సీఐ కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణానికి చెందిన నార్ల శ్రీనివాస్ అనే వ్యాపారి హైదరాబాదులోని హోల్‌సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన రూ.3లక్షల92వేల500 నగదుతో పాటు ఇతరపత్రాలను బ్యాగ్‌లో ఉంచుకొని ఈనెల3న వేములవాడ బస్టాండ్‌వద్ద బస్సు ఎక్కాడు. కొంతసేపటి తర్వాత తనబ్యాగు కనిపించకపోవడంతో సిరిసిల్ల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీఫుటేజీల ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండారి బాలరాజుగా గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం నగదును రికవరీచేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసును ఛేదించిన పట్టణసీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉండాలి

- ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు సమాజంలోని ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని, అప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. అవినీతి నిరోదకశాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని చెప్పారు. అవినీతిపై 1064టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది 32 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

కొనుగోలు కేంద్రం నుంచి 10 ధాన్యం బస్తాలు చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు శుక్రవారం చోరీకి గురయ్యాయని బాధిత రైతు భూక్య సురేశ్ పేర్కొన్నాడు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని రైతు భూక్య సురేశ్ తనకున్న రెండు ఎకరాల్లో వరి పంటను కోసి కేంద్రానికి తరలించాడు. గతనెల 29న నిర్వాహకులు తూకం వేసిన 101 ధాన్యం బస్తాలను కేంద్రంలోనే నిల్వ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు అందులో నుంచి 10 సంచులను ఎత్తుకెళ్లారు. ధాన్యం తరలింపులో జాప్యం వల్ల తన ధాన్యం బస్తాలను అపహరించుకుపోయారని బాధిత రైతు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారులు స్పందించి కేంద్రంలోని ధాన్యం బస్తాలను తరలించడంతో పాటు చోరీకి గురైన ధాన్యం సంచులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరాడు.

ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని.. బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన యువకుడు

వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన యువకుడు తన ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని ఏకంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన సంఘటన వేముల వాడలో శుక్రవారం చోటుచేసుకుంది. వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి మొదటి బైపాస్ మీదుగా వేములవాడ బస్టాండ్ వైపు వస్తోంది. ప్రయాణికులను దింపుతూ వస్తుండగా ఎక్కడపడితే అక్కడ బస్సు ఆపుతూ తన ద్విచక్ర వాహనానికి సైడ్‌ఇవ్వడం లేదని ఓ యువకుడు ఆగ్రహం చెందాడు. ఏకంగా రోడ్డుకు అడ్డంగా తన ద్విచక్రవాహనాన్ని నిలిపి ఆర్టీసీ బస్సును అడ్డుకున్నాడు.

బస్సు డోర్ వద్దకు చేరుకొని డ్రైవర్, కండక్టర్లపై తిట్ల పురాణం అందుకోవడమే కాకుండా దాడికి యత్నించాడు. సంఘటనను చిత్రీకరిస్తున్న ప్రయాణికులను సైతంతిట్టి సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనచెందగా పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన సంఘటన మరవకముందే వేములవాడ ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌పై ఆ యువకుడు వ్యవహరించిన తీరుతో ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

కన్నుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గుంటి పురుమాండ్ల రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. దేవాలయంలో వేద పండితులు శంకర్ శర్మ, పణీంద్ర శర్మ, ఆరుణ్ శర్మ, కాశిక్ చారి, సునిల్‌ల మత్రోత్సరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయంలో మూల విరాట్‌కు అర్చన అభిషేకాలను జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను రథంలో ఉంచి రతోత్సవంను నిర్వహించారు. రథోత్సవంలో ఉన్న స్వామిని దేవాలయం చుట్టు ప్రదక్షణను నిర్వహించిన భక్తులు రథం లాగీ మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఖీన్‌పూర్, కోరుట్ల పట్టణంకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ అండర్-19 చెస్ జట్టుకు కోచ్‌గా అనూప్ కుమార్


అనూప్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈ నెల 5 నుంచి 7 వరకు జరగనున్న 69వ కళాశాలల అండర్-19 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు జిల్లాకు చెందిన కంకటి అనూప్ కుమార్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో పలుమార్లు తెలంగాణ చెస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన అనూప్ అండర్-19 జట్టుకు కూడా కోచ్‌గా వ్యవహరించడం విశేషం. ఈ సందర్భంగా అనూప్‌కు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు అభినందించారు.



పోలీసులకు సమాంతరంగా సేవలు

అయినా గుర్తింపునకు నోచుకోని హోంగార్డులు

- ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డు, కారుణ్య నియామకాల కోసం దీర్ఘకాల పోరాటం...
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో సమానంగా తమకు గుర్తింపు లభించటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హోంగార్డులు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఇటు ప్రభుత్వం అటు పోలీసు శాఖలు పరిష్కరించలేక పోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతోపాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం హోంగార్డుల సమస్యలు పరిష్కరించకుండా వెట్టి చాకిరి వ్యవస్థగానే చూస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది సీఎం కేసీఆర్ హోంగార్డుల వేతనాలను తొమ్మిది వేల నుంచి 12 వేలకు పెంచారు. పనికి తగిన వేతనం లభించడంలేదనే అసంతృప్తి హోంగార్డుల్లో నెలకొన్నది.

స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..

హోంగార్డుల వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1959లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. కాలక్రమేణా పోలీస్ శాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1983లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. ఉద్యోగం శాశ్వతం కాక పోవడంతోపాటు రోజు రోజుకు పెరుగుతున్న ఖర్చులతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖతోపాటు అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ తదితర ప్రభుత్వ శాఖల్లో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రోజువారి గౌరవ వేతనం వెయ్యి రూపాయలు ఇస్తారు. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు అదనంగా 30 శాతం అలవెన్స్ వస్తుంది. పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఎలాంటి ఆర్థిక సహకారం లభించడం లేదు. 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి, ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరగబోయే 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డీజీపీ ఉత్తర్వులు ఇవ్వడంతో హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,127 మంది హోంగార్డులు ఉన్నారు.

ప్రధాన డిమాండ్లు

- 2017 ఎస్‌పీఏ ఉత్తర్వులను అమలు చేసి హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- మరణించిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామకాలు కింద ఉద్యోగ సౌకర్యం కల్పించాలి.
- 2025 సంవత్సరంలో మరణించిన హోంగార్డు కుటుంబాలకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదు లక్షల రూపాయలు అందజేయాలి.
- హోంగార్డులకు ఆరోగ్య భద్రత కార్డు సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్ నిధులు విడుదల చేయాలి.
- పదవీ విరమణ పొందిన హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలి.
- కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన సడలింపులు హోంగార్డులకు ఇవ్వాలి.
- వేతనంలో కోత లేకుండా వారంలో ఒక సెలవు ఇవ్వాలి
- మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలి.
- ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలి.
- కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ కల్పించాలి.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన తరగతులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌పై ట్రైనింగ్ క్లాసులకు దరఖాస్తులు కోరుతున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవడంతో పాటు స్కాలర్‌షిప్‌లు పొందడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ నెల 21 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-24071178, 0878- 2268686 నెంబర్లలో ఆఫీసు సమయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు.

నాందేడ్ నుంచి కొల్లాం ప్రత్యేక రైలు

- ఫలించిన మంత్రి అడ్లూరి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాందేడ్ నుంచి జగిత్యాల మీదుగా అయ్యప్పస్వాముల కోసం ప్రత్యేక రైలు నడపాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముఖేష్ ఖన్నా రైల్వే అధికారులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు విన్నవించారు. స్పందించిన మంత్రి దక్షిణ మధ్య రైల్వే జీఎంతో మాట్లాడి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారు. డిసెంబరు 24, జనవరి 7 తేదీల్లో నాందేడ్ నుంచి కొల్లం వరకు(శబరిమల) ప్రత్యేక రైలు అందుబాటులో ఉండనుంది.

సీసీఎల్‌ఏ భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

- దేవాదాయశాఖ ఉప కమిషనర్ సునీత

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5: దేవాదాయశాఖకు చెందిన సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్, వరంగల్ జోన్ ఉప కమిషనర్ సునీత సూచించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. రాష్ట్ర కమిషనర్, ఉప కమిషనర్ ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారని అన్నారు. ఆలయాల భూములు 43వ సెక్షన్ కింద రిజిస్ట్రేషన్ చేసే ముందు పూర్వ రికార్డులైన కాస్ర, సేతువర్, చెస్ల వంటి వాటిని సేకరించి వాటిలో సర్వే నెంబర్లు ధ్రువీకరణ చేయాలని తెలిపారు. వివరాలను 22-ఏ(ఐ)సి ప్రొఫార్మాలో నమోదు చేసి రికార్డులను రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిలా సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్లు, కార్యనిర్వహణాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ సునీత

నామినేషన్‌ను అనుమతించండి

- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థి

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో రామగిరి మండలం పెద్దపేట సర్పంచ్ అభ్యర్థి చింతపట్ల సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 29న సర్పంచ్ అభ్యర్థిగా సుహాసిని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషను తీసుకున్న అధికారులు గత నెల 30న జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఆమె పేరు గ్రామ ఓటర్ల జాబితాలో లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా తన కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయని, తన ఓటు గల్లంతు అయిందని తనకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ నామినేషన్‌ను ఆమోదించాలని కోరుతూ సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు.

అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే చర్యలు

పెద్దపేట గ్రామ సర్పంచ్ ఎన్నికల విషయంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్టు తమకు ఎటువంటి కోర్టు ఆదేశాలు అందలేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఆర్టీసీ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలంలో అధికారులు నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణంపై రగడ మొదలైంది. ప్రహరీ నిర్మాణంపై చుట్టు పక్కల కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయ్యడంతో నిర్మాణం వివాదాస్పదంగా మారింది. కోరుట్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఎకరం ఇరవై గుంటల స్థలంలో ఇటీవల కొందరు స్థలం మాదంటూ మట్టి పోసి చదను చేసిన విషయం తెలిసిందే. స్థల ఆక్రమనకు పాల్పడిన వారిపై డిపో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ఆర్‌టీసీ అధికారులు ఆ స్థలంలో రాళ్లతో హద్దులను ఏర్పాటు చేసారు. ఆర్‌టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల పరిరక్షణ కోసం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న చుట్ట పక్కల కాలనీ వాసులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతం నుంచి రాకపోకలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డీఎం మనోహర్‌కు వినతిపత్రం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి అక్కడి చేరుకుని కాలనీవాసులను సముదాయించారు.


డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న కాలనీ వాసులు

సర్పంచ్‌లో బరిలో 80 ఏళ్ల వృద్ధురాలు

- జనరల్ మహిళ రిజర్వు
- ఉప్పట్ల పోటీలో అందరూ ఎస్సీ మహిళలే

మంథని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పట్ల గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయంగా చర్చనీయాశంగా మారాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీల కోసం అంతా యువతా ఉత్సాహం చూపుతుండగా.. వారి కంటే నేనేం తక్కువ కాదంటూ.. ఉప్పట్ల గ్రామ సర్పంచ్‌గా కాసిపేట వెంకటమ్మ అనే వృద్ధురాలు నామినేషన్ దాఖలు చేశారు. 80 ఏళ్ల వయస్సులో సైతం గ్రామ ప్రజలకు సేవ చేయటానికి ముందుకు వచ్చిన వెంకటమ్మను అందరూ అభినందిస్తున్నారు. ఉప్పట్ల గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కాగా ప్రస్తుతం సర్పంచ్ పోటీలో ఉన్న ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటం గమన్హారం. గ్రామంలోని 8 వార్డుల్లో 4 వార్డులు జనరల్‌గా రిజర్వు కాగా, మరో నాలుగు ఎస్సీలకు రిజర్వు అయ్యాయి.

అయితే మొత్తం 8 స్థానాల్లో సైతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే పోటీలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.


సర్పంచ్‌గా పోటీ చేస్తున్న కాసిపేట వెంకటమ్మ

దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు


స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్


స్పీడ్ బోట్‌లో స్వామి దర్శనానికి వెళ్తున్న మంత్రి, విప్

బోయినపల్లి, డిసెంబర్, 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ దత్తాత్రేయ స్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి గుట్టపై జరుగుతున్న దత్త జయంతి ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్‌లో మంత్రి పొన్నం, విప్ ఆది గుట్టపై చేరుకున్నారు. సందర్భంగా దత్తాత్రేయ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దత్త జయంతి ఉత్సవాల సమయంలోనే కాకుండా ప్రతి రోజు దర్శనం కోసం బోట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మండల పార్టీ అధ్యక్షులు వెన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.7,300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7300 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 50మంది రైతులు 464 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ట ధర రూ.7300, కనిష్ఠ ధర రూ.6400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి రాజు దగ్గరుండి పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవుదినాలు కాగా, సోమవారం తిరిగి పత్తి క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి.

చిల్లర నాణేలతో నామినేషన్

ఇల్లందకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మారపెల్లి సృజన్‌బాబు వినూత్న రీతిలో శుక్రవారం నామినేషన్ వేశారు. ఇల్లందకుంటలో నామినేషన్ వేసేందుకు అభ్యర్థి సృజన్‌బాబు సాయంత్రం 4గంటలకు కేంద్రానికి చేరుకోగా రిటర్నింగ్ అధికారి 31 టోకెన్ ఇచ్చారు. ఆఖరి టోకెన్ కావడంతో అతను చిల్లర నాణెలు వెయ్యి రూపాయలు ఇచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు అప్పటికే రాత్రి 10గంటలు కాగా, వాటిని లెక్కించేందుకు కొంత సమయం పట్టింది. ఈ విషయంపై సృజన్‌బాబును అడుగగా రూపాయి విలువ తగ్గలేదని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకొని నామినేషన్ వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు చెప్పారు.


చిల్లర నాణెలను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

వేములవాడలో భక్తుల రద్దీ


భీమేశ్వరాలయంలో భక్తులు


క్యూలైన్‌లో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 05(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి దేవస్థానం భక్తజనసంద్రమైంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 25వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పై అంతస్థులో కల్యాణం, సత్యానారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకి సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామివారిని ఎల్ఈడి స్క్రీన్‌లో దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈఈ రాజేష్ క్యూలైన్‌లను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

బద్దిపోచమ్మకు బోనాలు

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

యూనివర్సిటీ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్సారార్ విద్యార్థులు


మోతె అనిల్


ఎడ్ల విష్ణువర్ధన్


గుగ్గిళ్ల సంతోష్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు నగరంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ స్థాయి క్రాస్‌కంట్రీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మోతె అనిల్, ఎడ్ల విష్ణువర్ధన్, గుగ్గిళ్ల సంతోష్‌లు హర్యానా రాష్ట్రం రోతక్‌లో దయానంద్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 21న జరిగే అఖిల భారత యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌చార్జి పీడీ డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టి రాజయ్య, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, డాక్టర్ మీసాల మల్లారెడ్డి, పడాల తిరుపతి తదితరులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్స్‌పాల్

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంథని జేఎన్‌టియూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండ్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కనుంట్ల లక్ష్మన్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, కొమురోజు శ్రీనివాస్, విజయ్, ఖాజాబి, నాలుగు జిల్లాలకు చెందిన అండర్ 14, 17బాల బాలికలు పాల్గొన్నారు.

అన్నా.. తప్పక రావాలే..

(5వ పేజీ తరువాయి)

వలస ఓటర్లను సైతం తమవైపు తిప్పుకునేందుకు బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి ఆయా ప్రాంతాల్లో రోజువారీ వంటకాలు, విందులకు ప్లాన్ చేసుకుంటున్నారు. పట్నం ఓటర్లు ఏఏ ప్రాంతాల్లో ఉన్నారనే లెక్కల మేరకు ఒక్కో ఏరియాకు ఇన్‌చార్జిలను నియమించి పోలింగ్ తేదీ వరకు అక్కడే ఉండే విధంగా ప్లాన్ చేశారు. ఇన్‌చార్జిలు ప్రతీ రోజు వలస ఓటర్లను కలవడం, పనులు ముగించుకుని ఇంటికి రాగా దావత్‌లతో ఖుషీ చేయడం వంటి కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు.

ప్రభుత్వ అధ్యాపకురాలు సుజాతకు డాక్టరేట్

జగిత్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో పనిచేస్తున్న వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు సుజాత కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ క్రిస్టఫర్ రూబెన్ పర్యవేక్షణలో 'టిష్యూ కల్చర్ ఫైటో కెమికల్ అనాలసిస్ అండ్ ఫార్మకాలజికల్ స్టడీస్ ఇన్ రూబియా కార్డుఫోలియా' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్ కుమార్, చంద్రయ్య, డాక్టర్ సంగీత, డాక్టర్ శ్రీలత, నీరజ, మల్లికార్జున్, డాక్టర్ వాసవి వ, డాక్టర్ జమున తదితరులు అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘ సభ్యులు

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పందుల బెడద వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాయికల్ శివాజీ గోసె కాపు రెడ్డి రైతు సంఘం నాయకులు శుక్రవారం రాయికల్ మున్సిపల్ మేనేజర్ వెంకటికి వినతి పత్రం సమర్పించారు. రాయికల్ పట్టణ శివారు ప్రాంతంలో గల రైతుల వ్యవసాయ పంట పొలాల్లోకి పందులు చొరబడి నాటిన పంటల విత్తనాలను, పంట మొక్కలకు తీవ్ర నష్టం చేస్తున్నాయని, దీనిని నివారించేందుకు స్థానిక పందుల పెంపకందారులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల పంటలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ రెడ్డి, రైతులు మోటకాడి లింగారెడ్డి, కుర్మ మహిపాల్ రెడ్డి, మోటకాడి నరేందర్ రెడ్డి, బొడగం ముత్యం రాజు, దమ్మ గంగారెడ్డి, కొయ్యడి జైపాల్ రెడ్డి, లక్కాడి శ్రీనివాస్ రెడ్డి, పడిగెల కిషోర్ రెడ్డి, పిన్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడం లేదని ఫిర్యాదు

జగిత్యాల టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్త రోడ్డులు, డ్రైనేజి నిర్మాణాలకు భూమి పూజలు చేయడం తప్ప జగిత్యాల పట్టణంలో ప్రజలకు మౌలిక వసుతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలం అయ్యారని తాజా మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలో వీధి కుక్కలు పెరిగి ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. పందులు కూడా పెరిగిపోయి వాటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవాడంలేదని తెలిపారు. దోమల మందు స్ప్రే లేదని, ఫాగింగ్ చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. స్ట్రీట్ లైట్లు పెట్టడంలేదని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని శ్రీఎస్‌ఎస్‌వి జూనియర్ కళాశాలకు చెందిన సౌమిత్‌రాజ్ కుమితే అండర్ 16-18 విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మెన్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ పల్లెర్ల నరేష్ ఒక ప్రకనటలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గల రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 27 నుంచి 30 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సౌమిత్‌ను కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐటీ అకాడమీలో మూడో తరగతి చదువుతున్న అవంతిక రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. నవంబరు 30న మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, ఈ నెల 6,7 తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికవడం గర్వకారణం అన్నారు. రాష్ట్రస్థాయిలో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, అజిత, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా మండలంలోని జోగినిపల్లి గ్రామంలో పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సంస్కృతి సారధి కళాకారులు శుక్రవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై నృత్యాలు, జాన పద గేయాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికలో చెత్త తొలగింపు



ఎక్స్‌కావేటర్ డ్రైవర్‌కు సూచనలు చేస్తున్న దొనికెల నవీన్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో గల హిందూ శ్మశాన వాటికలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ చెత్త తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేయించారు. ఇటీవల శ్మశాన వాటికలో విపరీతమైన చెత్తచెదారం పేరుకుపోవడంతో వార్డు ప్రజలు నవీన్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి శుక్రవారం ఎక్స్‌కావేటర్ ద్వారా శ్మశాన వాటికలోని చెత్తను తొలగింపచేశారు. ఈ సందర్భంగా నవీన్‌ను ప్రజలు అభినందించారు.

ముగిసిన మూడో విడత నామినేషన్ల స్వీకరణ



ధర్మపురి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ధర్మపురి మండలంలో 25 గ్రామపంచాయితీ స్థానాలకు గాను మూడు రోజుల్లో మొత్తం 150 మంది సర్పంచ్ అభ్యర్థులు, 224 వార్డుస్థానాలకు 501 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు.

● **రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం..**

ధర్మపురి మండలంలో నర్సయపల్లె, బోదరినక్కల చెరువుగూడెం సర్పంచ్ స్థానానికి కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. అన్‌రిజర్వ్ చేసిన నర్సయ్యపల్లె గ్రామపంచాయతీ స్థానానికి పోతంశెట్టి నర్సయ్య ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయిన బోదరినక్కల చెరువుగూడెం గ్రామపంచాయతీ స్థానానికి గోపు రాజన్న ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆ ఇద్దరు సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. బోదరినక్కల చెరువుగూడెం గ్రామపంచాయితీలోని ఆరు వార్డు సభ్యుల స్థానాలకు కేవలం ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయగా వారందరు ఏకగ్రీవం కానున్నారు. అధికారులు నామినేషన్ల పరిశీలన అనంతరం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

వెల్గటూర్: మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్ స్థానాలకు 125 నామినేషన్లు, 168 వార్డులకు గాను 364 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో వెంకటప్రసాద్ తెలిపారు. వెల్గటూర్‌లో 6వ వార్డు, రాజక్కపల్లిలో ఎనిమిది వార్డులకు ఆరు వార్డులు, వెంకటాపూర్‌లో ఐదు, తాళ్లకొత్తపేటలో రెండు, స్తంభంపల్లిలో రెండు, పాషిగామలో ఒకటి, ముక్కట్రావ్‌పేటలో ఒక్కటి, కుమ్మరిపల్లిలో నాలేగే, కిషన్‌రావుపేటలో నాలుగు, కప్పారావుపేటలో రెండు, బీరుసానిలో రెండు వార్డులకు ఒక టే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీ వం కానున్నాయి.

గొల్లపల్లి: మండలంలో 27 సర్పంచ్ స్థానాలకు 203 నామినేషన్లు, 246 వార్డు స్థానాలకు 613 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో రవీందర్‌రావు తెలిపారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో 23 సర్పంచ్ స్థానాలకు గాను 196 నామినేషన్లు, 216 వార్డు స్థానాలకు గాను 551 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీవో శశికుమార్‌రెడ్డి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు .

బుగ్గారం: బుగ్గారం మండలంలో పది సర్పంచ్ స్థానాలకు 112 నామినేషన్లు, 96 వార్డు స్థానాలకు 262 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో సుమంత్ తెలిపారు.

ఎండపల్లి: మండలంలోని 15 గ్రామపంచాయ తీలకు గానూ 138 నామినేషన్లు, మొత్తం 138 వార్డు స్థానాలకుగానూ మండలంలోలో 15 గ్రామం పంచాయతీలు, 138 వార్డుసభ్యులకు గానూ 467 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు తెలిపారు.

సాయి ఈశ్వర్ చారిది ప్రభుత్వ హత్యే

జగిత్యాల టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర్ చారి మరణం ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యే అని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఒక ప్రకటనలో అన్నారు. ఈశ్వర్ చారి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ చేసిన దారుణమైన మోసానికి యువకుడు సాయి ఈశ్వర్ నిండు ప్రాణం బలైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని బీసీలకు, వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఏకగ్రీవ సర్పంచ్‌కు సన్మానం

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అభ్యర్థి డిండిగాల గంగురామస్వామి గౌడ్‌ను మండల గౌడ సంఘం నాయకులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని, ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిపేందుకు కృషి చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఉత్కం సాయ గౌడ్, ఉపాధ్యక్షుడు కొత్తకొండ లింగంగౌడ్, ప్రధాన కార్యదర్శి బొంగోని భూమాగౌడ్, నాయకులు ముత్తయ్య గౌడ్, రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు





మల్యాలలో బహుమతులు అందిస్తున్న ఎంఈవో, ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న అతిథులు

మల్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని నూకపల్లిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన మారంపల్లి విపంచి, రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అరవింద్, ముఖేశ్ విద్యార్థులను మండల విద్యాధికారి అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు సుమిత్ర, హెచ్‌ఎం హరికృష్ణప్రసాద్, ఉపాద్యాయులు అబ్దుల్ జమీల్, రిసోర్స్‌పర్సన్ అనూష, శ్రీలత, సీఆర్పీ మమత, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ వసంత తదితరులు పాల్గొన్నారు

ధర్మపురి: అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ధర్మపురి మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సీతాలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు దేవుడిచ్చిన వరప్రసాదమని భావించి వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సమాజంలోని ప్రతీరంగంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆమె పేర్కొన్నారు. వారికి సేవలు అందించే తల్లిదండ్రులను అభినందించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులు అందించారు. ఎం. దీక్షిత అనే దివ్యాంగురాలు పుట్టిన రోజును ప్రత్యేకంగా నిర్వహించి, అందరికి టీ, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల విద్యాధికారి సీతాలక్ష్మి, ఐఆర్‌పీలు కె. స్వప్న, ఎ లక్ష్మి, సీఆర్‌పీలు రాజ్‌కుమార్, సత్యనారా యణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

● **దివ్యాంగులకు సహకరించాలి...**

ఇబ్రహీంపట్నం: ప్రతీఒక్కరు దివ్యాంగులకు సహకరించాలని, వారిని చిన్నచూపు చూడటం, అవహేళన చేయడం తగదని మండల విద్యాధికారి బండారి మధు సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా స్థానిక వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగ పిల్లల్ని తల్లిదండ్రులు పెంచడంలో పడే కష్టాలు ఎన్నో ఉంటాయన్నారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని అన్నివర్గాల వారు దివ్యాంగులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దివ్యాంగులకు నిర్వహించిన పలు క్రీడాపోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రదీప్, ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, సీఆర్‌పీ రవీందర్, రాజేందర్, శివరాం, ఐఆర్‌పీ శ్రీకాంత్, ఎమ్‌ఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన పంచాయతీ కార్యవర్గం



మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో చర్లపల్లి గ్రామపంచాయతీ కార్యవర్గ సభ్యులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జగిత్యాల మండలం చర్లపల్లి గ్రామపంచాయతీ కార్యవర్గం మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. చర్లపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు ఆరు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ మేడిపల్లి వనిత, ఉపసర్పంచ్ దుమల సుమన్, వార్డు సభ్యులు ఇమ్మడి విజయ్, బాలుసాని విజయ, బాలుసాని స్వరూప, కోల రాజిరెడ్డి, బొమ్మెన రాజేందర్‌ను మాజీ మంత్రి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు మండలంలోని కన్నపూర్ గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవం కావడంతో సర్పంచ్ పొట్టవత్తిని సతీష్, వార్డు సభ్యులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఆయన సర్పంచ్ సతీష్‌పాటు వార్డు సభ్యులను సన్మానించారు.

బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గ్రామాల అభివృద్ధి కోసం అనేక నిధులను కేటాయిస్తున్నారని అన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల్లో నూతన వెలుగుకు శ్రీకారం చుట్టాలని అన్నారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్, మండల పట్టణ అధ్యక్షుడు ఆకుల మహేష్, కురుమ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజనాల మధు, ప్రధాన కార్యదర్శులు ఏనుగు రవీందర్ రెడ్డి, కునారపు భూమేష్, సంజీవ్, ఉపాధ్యక్షులు సంకోజి మహేష్, కడార్ల శ్రీనివాస్, అల్లె నర్సయ్య, కార్యదర్శులు నల్లాల శేఖర్, సంకటాల సత్తన్న, సబిత రెడ్డి, నాయకులు మచ్చ నారాయణ, సామల్ల సతీష్, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, శ్రీరామ్ గౌడ్, అందె శంకర్, చీపెల్లి నర్సయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలి - డీపీవో రఘువరన్



కోరుట్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని డీపీవో రఘువరన్ అధికారులకు సూచించారు. మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌లో ఎన్నికల నియమావళి, ఓట్ల లెక్కంపై శుక్రవారం శిక్షణను అందించారు. ఈ సందర్భంగా డీపీవో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ఏర్పాట్లను చేసుకోని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి సుధీర్‌కు ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు విరిగాయి. విషయం తెలుసుకున్న భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, దోసిలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి శుక్రవారం సుధీర్‌ను పరామర్శించారు. ఆయన వెంట బక్కూరి నరేష్, ముంజ కిషన్, చెక్కపెల్లి శంకర్, పెద్దిరెడ్డి స్వామి ఉన్నారు.

శిశు మరణాలను తగ్గించాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని నవజాత శిశు కేంద్రాన్ని సంకల్ప ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, వైద్యాధికారి లక్ష్మీభవాని, వెంకటేశ్వర్లు, డీహెచ్‌ఎంవో వాణిశ్రీ శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని నవజాత శిశువుల చికిత్స విధానాన్ని పరిశీలించారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, నెలలు నిండక ముందు పుట్టిన శిశువులపై ఆరా తీశారు. అనంతరం అడ్డగుంటపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. పిల్లల వైద్య నిపుణుడు రాజీవ్, నర్సింగ్ ఆఫీసర్ సువర్ణ ఉన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణలో నేలది కీలక పాత్ర

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య పరిరక్షణలో నేల కీలక పాత్ర పోషిస్తుందని కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో కరీంనగర్ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంట అవశేషాల నిర్వహణ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ, శాస్త్రవేత్త డాక్టర్ ఇ రజనీకాంత్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే అద్భుత ఫలితాలు

- అదనపు కలెక్టర్ బీఎస్ లత - జిల్లా కేంద్రంలో పీఎంశ్రీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధనతోనే అద్భుత ఫలితాలు సాధించవచ్చునని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో జిల్లాస్థాయి పీఎంశ్రీ క్రీడాపోటీలు నిర్వహించగా, ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా సుమారు 950మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ లత క్రీడాకారులను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగిత్యాల జిల్లా క్రీడాకారులు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికై, అక్కడ కూడా సత్తా చాటుతూ జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నిరంతర తర్ఫీదుతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీయం అన్నారు. క్రీడల ద్వారా మానసిక వికాసం, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం సిద్ధిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని, ఓడినా అధైర్యపడకుండా ముందుకు సాగుతూ, క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకొని, ఉన్నతిని సాధించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు క్రీడలపై ఆసక్తిని పెంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాముతో పాటు, అధికారులు, పీఈటీలు, పీడీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నేల సంరక్షణపై పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులను పొందుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, సాయినాథ్, వేణు రెడ్డి, డాక్టర్ సంధ్యకిషోర్, స్పందన, రాజేష్, మధుకర్, స్వాతి, రామకృష్ణ, సుమలత, స్వాతి, శ్రీలక్ష్మి, ఏవో ముక్తేశ్వర్, ఏఈవో సతీష్, కోరమాండల్ అధికారులు వినోద్, ఏరియా మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్



మేడిపల్లి ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

మేడిపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని కోరుట్ల సీఐ సురేష్‌బాబు తెలిపారు. మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, కోరుట్ల ఎస్సై చిరంజీవి, కథలాపూర్ ఎస్సై నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.